క్లుప్తంగా

బీసీ రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్



రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను అభినందిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దేశవ్యాప్తంగా చట్టసభల్లో, ఉద్యోగుల పదోన్నతుల్లో బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వర రావు తెలిపారు. ఇటీవల ఆర్.కృష్ణయ్యను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పీఆర్‌టీయూ నేతలు మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా కృష్ణయ్య చేసిన వ్యాఖ్యలను శనివారం ఏలూరులో విడుదల చేసిన ప్రకటనలో వివరించారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ స్థాయిలో ఆర్.కృష్ణయ్య చేస్తున్న పోరాటానికి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతుగా ఉండాలని కోరారని తెలిపారు. కృష్ణయ్యను కలిసిన వారిలో చిత్తలూరి ప్రసాద్, బొల్లేపల్లి మధుసూధన రాజు తదితరులున్నారని తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



పోణంగిలో ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు పాతిన గ్రామాధికారులు

ఏలూరు రూరల్ : పోణంగిలో ఆర్ఎస్ నెంబర్ 214–1లో 4.40 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమించేవారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వో ఎం శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ప్రభుత్వం ఈ భూమిలో లే–అవుట్ వేసి పేదలకు స్థలాలు పంపిణీ చేసిందన్నారు. కొద్దిరోజుల క్రితం గొర్రె సోమయ్య, తల్లిబోయన వీరాస్వామి, శ్రీనివాసరావు, దనికొండ రాము, మజ్జి వెంకటరమణ అను వ్యక్తులు లే–అవుట్ భూమిలో మొక్కలు నరికి కాల్చివేసారని ఫిర్యాదులో వివరించారు. ఇదే క్రమంలో అధికారులు పాతిన సర్వే రాళ్లు సైతం తొలిగించి ఆక్రమించేందుకు ప్రయత్నించారని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఏర్పాటుచేసిన హెచ్చరిక బోర్డు సైతం పీకేసారని వివరించారు. అధికారుల ఆదేశాల మేరకు మరోసారి ఆక్రమణలు తొలిగించి బోర్డు ఏర్పాటుచేశామన్నారు.

ఆరోగ్య రథాలు.. అపర సంజీవనులు

- వైద్య సేవలకు సర్కారు ఊపిరి
- విశేష సేవలందిస్తున్న 108, 104
- ప్రజల ప్రాణాల రక్షణలో కీలకపాత్ర





గ్రామాల్లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న 104 వాహనం, వైద్యుల బృందం (ఫైల్), రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులను హాస్పిటల్‌కు చేర్చేందుకు సిద్ధంగా ఉన్న 108 వాహనం (ఫైల్)

ఏలూరు టౌన్ : ఆపద వస్తే చాలు.. కుయ్... కుయ్... కుయ్ అంటూ వేగంగా దూసుకువచ్చి ప్రజల ప్రాణాలను రక్షించటంలో కీలకపాత్ర పోషిస్తుంది 108 అంబులెన్స్. ఇక పల్లెల్లోని ప్రజల వద్దకే వైద్య సేవలు అందించే 104 సంచార వైద్యశాల. ఇవన్నీ ఆరోగ్య రథాలుగా, అపర సంజీవనిలా ప్రజలకు విశేషమైన సేవలు అందిస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన అనంతరం వైద్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆనాడు ప్రవేశపెట్టిన 108, 104 వైద్య సేవలను గత టీడీపీ పాలనలో నిర్వీర్యం చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యంతో ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించే పరిస్థితి లేక ప్రాణాలపై ఆశలు వదిలేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కానీ ముఖ్యమంత్రిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకు వేసి మరీ ఈ అత్యవసర సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

ఆధునిక హంగులతో అత్యవసర సేవలు

ఏలూరు జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో కూడిన 108, 104 అత్యవసర సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచి మెరుగైన సేవలు అందిస్తున్నారు. కరోనా వంటి కష్టకాలంలోనూ, ఏలూరులో ఆకస్మికంగా ప్రజలు తలతిరిగి పడిపోయిన విపత్కర పరిస్థితుల్లోనూ 108 అంబులెన్స్ సేవలు మరువలేనివి. ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే క్షణాల్లోనే క్షతగాత్రులను హాస్పిటల్‌కు చేర్చి, ప్రాణాలు రక్షిస్తున్నాయి. అంబులెన్స్‌లోనే ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండడంతో ప్రమాదంలో తీవ్ర గాయాలైనా ప్రథమ చికిత్స అందిస్తూ క్షేమంగా హాస్పిటల్‌కు తరలిస్తున్నారు.

108 అంబులెన్స్ సేవలు ఇలా..

- ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే ఇంటికి వెళ్లి బాధితులను హాస్పిటల్‌కు తరలిస్తాయి.
- పీహెచ్‌సీ, సీహెచ్‌సీల నుంచీ అత్యవసర స్థితిలో రోగులను ఏలూరు జిల్లా కేంద్రం సర్వజన ఆసుపత్రికి తరలించటంలో కీలకపాత్ర పోషిస్తాయి.
- రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్యచికిత్స అందిస్తూ వెంటిలేటర్ సహాయంతో మొదటి కీలకమైన సమయంలోనే వేగంగా హాస్పిటల్‌కు చేర్చుతాయి.
- నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బంది, ఆక్సిజన్, వెంటిలేటర్, ఇతర ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయి.

104 వాహన సేవలు ఇలా..

- ప్రతి ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలోనూ ఒక 104 వాహనాన్ని ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.
- గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య సేవలు అందించేందుకు వైద్యులు 104లో రోజుకో ఊరిలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు.
- దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా గ్రామాల్లోనే పేదవర్గాల ప్రజలకు ఉచితంగా బీపీ, సుగర్, ఇతర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్నారు
- గర్భిణులు, బాలింతలకు సైతం వైద్యులే ఇంటికి వెళ్లి మరీ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందిస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు.
- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన రోగుల ఇంటికే వెళ్లి మరీ వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వటం విశేషం.

వైద్యాన్ని చేరువ చేశారు



గతంలో చంద్రబాబు హయాంలో కనీసం ప్రజలకు సరైన వైద్యం అందే పరిస్థితి లేదు. 108 అంబులెన్సులు పాడుబడిపోయి రిపేర్లతో ఎక్కడవి అక్కడే ఉండేవి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారు. ఆధునిక సదుపాయాలతో 108 అంబులెన్స్‌లు, 104 సంచార వైద్యశాల వాహనాలను భారీ ఎత్తున కొనుగోలు చేసి ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేశారు.

– జిజ్జువరపు విజయనిర్మల, కార్పొరేటర్, ఏలూరు

ప్రజారోగ్యానికి పెద్దపీట



ప్రజారోగ్యం పట్ల అత్యంత శ్రద్ధ వహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో సంస్కరణలకు తెరతీశారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్లనాని నాయకత్వంలో ఏలూరుకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ తీసుకువచ్చారు. ఇక ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన బాధితులను రక్షించేందుకు 108 అత్యవసర సేవల అంబులెన్స్ సంజీవనిలా పని చేస్తున్నాయి. ఒకప్పుడు ప్రమాదం జరిగితే కనీసం ఎవరూ పట్టించుకునేవారే కాదు.

– నిడికొండ నరేంద్ర, యువజన నాయకులు, ఏలూరు

ప్రజల్లో చెరగని ముద్ర



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఆధునిక సౌకర్యాలతో ప్రారంభించిన 108, 104 వాహన సేవల పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తూ, మరోవైపు ప్రజల ఆరోగ్యంపై మరింత శ్రద్ధతో జగనన్న చేస్తోన్న సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయి. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సారథ్యంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

– యల్లాపు మోజెస్, ఏలూరు వన్‌టౌన్

మెరుగైన సేవలే లక్ష్యం



ప్రజలకు అత్యుత్తమ స్థాయిలో సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అరబిందో కంపెనీ సంయుక్తంగా 108 అత్యవసర సేవలను ప్రజలకు చేరువ చేశాయి. ఈ ప్రభుత్వం హయాంలో కొత్త వాహనాలు కొనుగోలు చేయటంతోపాటు, ప్రతి మండలానికీ ఒక అంబులెన్స్ ఉండేలా చర్యలు చేపట్టారు. టోల్‌ఫ్రీ నెంబర్ 108కు కాల్ చేయగానే క్షణాల్లోనే ప్రమాద సంఘటన స్థలానికి చేరుకుని ప్రాణాలు రక్షించేందుకు సిబ్బంది కృషి చేస్తున్నారు.

– జి.గణేష్, జిల్లా మేనేజర్, 108 సేవలు

హనుమజ్జయంతికి ఏర్పాట్లు పూర్తి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : హనుమజ్జయంతి ఉత్సవాలకు నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు చేశారు. హనుమద్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక దొండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి ఆలయంలో సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6.30 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, సహస్ర కలశ స్థాపన, వారుణానువాక పారాయణ, నమక క్రమార్చన, శ్రీరామ షడక్షరీ మంత్ర సహిత అంజనేయ మూలమంత్ర హోమం, పూర్ణాహుతి, కలశోద్వాసన పూజలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 11.30 గంటల నుంచి మన్యుసూక్త (పాదశ్చ, అర్ధశ్చ, పూర్ణశ్చ) విధానంగా కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారికి మహా స్నపన, విశేష అలంకరణ, అనంతరం అన్న సమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.

రామకోటి శ్రీరామ మందిరంలో..

స్థానిక రామకోటిలోని శ్రీరామ మందిరంలో ఉదయం 8 గంటలకు శ్రీ ఆంజనేయ స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం ఆకుపూజ, గంధ సింధూరంతో అష్టోత్తర పూజ, ప్రసాద వితరణ చేయనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మజ్జిగ వితరణ చేస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి హనుమాన్ చాలీసా పారాయణ, 6 గంటల నుంచి స్వామి వారికి మల్లెపూలతో సహస్రనామ పూజ నిర్వహిస్తారు.

హనుమాన్ శోభాయాత్ర

విశ్వహిందూ పరిషత్ ఏలూరు శాఖ, నగరంలోని హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక అల్లూరి సీతారామ రాజు స్టేడియం ఎదురుగా ఉన్న మోతేవారి స్థలం నుంచి ఈ యాత్ర ప్రారంభమౌతుంది. ఈ సందర్భంగా ఉజ్జయినికి చెందిన అఘోరీ సంస్థాన్ ఉప ప్రముఖ్ రాజేష్ నాథ్‌జీ అఘోరీ ఆధ్యాత్మిక ప్రసంగం ఉంటుంది.

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



గ్రామాధికారులతో సమావేశం నిర్వహించిన తహశీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ బి సోమశేఖర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి 1902 నెంబర్ ద్వారా ఫిర్యాదు కార్యక్రమం చేపట్టారని, ఈ కార్యక్రమం ద్వారా అందే ఫిర్యాదులను అధికారులు సత్వరం పరిష్కరించాలన్నారు. ఒకవేళ ఫిర్యాదు పరిష్కారం కాకపోతే, ఎందుకు కాలేదో, కారణం ఏమిటో అధికారులు చెప్పాలన్నారు. అధికారులు సైతం సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. గ్రామాల్లో చేపట్టిన ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సైతం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ క్షేత్ర స్థాయికి వెళ్లి రైతులతో మాట్లాడి భూ రికార్డులు పరిశీలించాలన్నారు.

ఇష్టపడి చదివితే విజయాలు సొంతం



పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థినిని అభినందిస్తూ జ్ఞాపిక అందజేస్తున్న ఎంబీఎస్ శర్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు ఇష్టపడి చదివితే విజయాలు సొంతమౌతాయని సీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వీరభద్రం సూచించారు. పదో తరగతి ఫలితాల్లో నగరంలోని శ్రీశ్రీ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటిన సందర్భంగా శనివారం ఆ విద్యాసంస్థలో ఏర్పాటుచేసిన అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఆర్‌ఓ వీఆర్ఎస్ ప్రసాద్, బ్రహ్మకుమారీస్ సంస్థ ఏలూరు జోన్ నిర్వాహకురాలు బీకే లావణ్య, శ్రీశ్రీ విద్యా సంస్థల అధినేత ఎంబీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

97 మందికి వైద్య సేవలు



ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక రామచంద్ర రావు పేటలోని శ్రీ కృష్ణ హాస్పిటల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 97 మందికి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ గత 3 నెలల నుంచి ప్రతి నెలా రెండవ శనివారం తమ ఆసుపత్రిలో పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఎముకలు, కీళ్ళు, నరాలు, వెన్నెముక వైద్యం అందుబాటులో ఉంటుందని, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, ఎముకల బలం, సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నామని ఏలూరు నగరంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అఖిల, నాగేశ్వర రావు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.అబ్రహం లింకన్, ఉపాధ్యక్షుడు ఏడీవీఎస్ సుబ్రహ్మణ్యం, పి.మురళీకృష్ణ, వీజీఎంవీఆర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	46
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-07
బెండకాయలు	24	కంద	72
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	44	అల్లం	220
క్యాబేజీ	18	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	34	పాలకూర	08-12
దొండకాయలు	26	చుక్కకూర	08-12
బంగాళదుంపలు	22	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	16	బఠాణి	--
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	15	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	02
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	13

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.15	34820	02
ఏలూరు -బీహెచ్ఈఎల్	09.00	4794	30
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	22.30	98515	45
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.50	98509	42
ఏలూరు -తిరుపతి	16.00	4830	24

లీడ్‌క్యాప్ డైరెక్టర్ సందీప్‌కు అభినంధనలు



సందీప్‌కు శాలువ కప్పి అభినందిస్తున్న నాయకులు

ఏలూరు రూరల్ : అంధ్ర ప్రదేశ్ లీడ్‌క్యాప్ డైరెక్టర్‌గా నియమితులైన ఎస్ సందీప్‌ను పలువురు నాయకులు ఏలూరులో అభినందించారు. శనివారం ఏలూరు మార్కెట్‌యార్డ్ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డైరెక్టర్ మేతర సురేష్, నగర కో–ఆప్షన్ సభ్యుడు మున్నల జాన్‌గురునాథ్, కార్పొరేటర్ నిర్మల కుమారితో పాటు ఎస్సీ ఎస్టీ మానటరీ సభ్యుడు మేతర అజయ్‌బాబు, ఎంఆర్‌పీఎస్ నాయకుడు కందుల రమేష్, కాశీ కృష్ణ, టి.సుమన్, కట్టింపూడి రంగారావు తదితరులు సందీప్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి, శాలువ కప్పి అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు విన్నపం మేరకు చర్మకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: భక్తులు, పెళ్లి జనాలతో శ్రీవారి క్షేత్రం శనివారం కళకళలాడింది. సెలవులు కావడంతో విద్యార్థులు, శుక్రవారం రాత్రి వివిధ ప్రాంతాల్లో వివాహాలు చేసుకున్న జంటలు, వారి బంధువులు వేలాదిగా ఆలయానికి తరలివచ్చారు. తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశ ఖండనశాల ఇతర విభాగాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారి ఉచిత అన్నప్రసాదం కోసం నిత్యాన్నదాన భవనం వద్ద భక్తులు బారులు తీరారు. క్షేత్రంలో సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన కాటూరి వివేకానంద శనివారం రూ. 1,00,016 విరాళంగా అందజేశారు. ఆయన కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక అశోక్ నగర్ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ అశోక్ నగర్ ఫీడర్‌లో వార్షిక మరమ్మతులు చేపట్టనున్న కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ నగరంలోని అమీనాపేట, అశోక్ నగర్, అశోక్‌నగర్ వంతెన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలోని భీమడోలు మండలంలో గురువారం సంభవించిన ఈదురుగాలులు, సుడిగాలి, భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల కారణంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను శనివారం పునరుద్ధరించినట్లు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు తెలిపారు. ఈ మేరకు మండలంలోని కురెళ్ళగూడెం, లింగంపాడు, దుద్దేపూడి, అంబర్‌పేట, కోడూరుపాడు, పూళ్ళ, ఎంఎంపురం తదితర గ్రామాల్లో 110 విద్యుత్ స్తంభాలు, 15 కిలో మీటర్ల మేర లైను, 10 పరివర్తకాలు దెబ్బతిన్నాయన్నారు. తమ యంత్రాంగం వాటిని సరి చేసి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని, విద్యుత్ సరఫరాలో ఇంకా ఏమైనా అంతరాయాలు ఉన్నా సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియచేసిన వెంటనే వాటిని కూడా సరిదిద్దే ఏర్పాటు చేస్తామన్నారు.

నేడు చాటపర్రులో హనుమద్ జయంతి

ఏలూరు రూరల్: చాటపర్రులోని శ్రీసువర్చలా సమేత అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమద్ జయంతి ఉత్సవాలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, మాజీ సర్పంచ్ కిలారు ప్రభాకర్‌రావు చెప్పారు. ఉదయం 9 గంటలకు స్వామివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. ఇదే క్రమంలో 11.30 గంటలకు భక్తులకు అన్న సమారాధన, సాయంత్రం 4.30 గంటలకు స్వామి వారి ఊరేగింపు ఉంటాయని, భక్తులు స్వామివార్లను దర్శించి తీర్థప్రసాదం స్వీకరించాలని కోరారు.

విషప్రయోగంతో చేపలు మృతి

జంగారెడ్డిగూడెం: స్థానిక అక్కమ కోనేరు చెరువులో విషప్రయోగం కారణంగా చేపలు మృతిచెందాయి. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు వడిగల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనేటి చెరువును 60 ఏళ్లుగా రజకులు వృత్తితో పాటు చేపలసాగుకు వినియోగిస్తున్నారు. ఈ చెరువులో మూడు నెలల క్రితం రూ.3 లక్షలు విలువైన చేప పిల్లలను వేశారు. శనివారం ఉదయం చెరువులో చేపలు తేలిపోయి కనిపించాయి. చెరువలో విషప్రయోగం జరిగినట్టు గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై ఎం.సాగర్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు. చెరువును పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ పశువులు, మూగజీవాలు చెరువు వద్ద నీటిని తాగకుండా గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. చెరువు నీటిని బయటకు తోడిస్తామని తెలిపారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

99122 20559
95055 08399
96408 32693

Office mail : tpgadvt@gmail.com